శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ - నవ్య వీక్లి కథల పోటీలో

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

వాకిట్లో వాన.

నడవా అంతా జల్లులు కొడుతూ, వానధాటీగా కురుస్తోంది. మధ్య మధ్యలో పహరాకాస్తున్న గూర్ఖాకేకల్లా ఆకాశం ఉరుముతోంది. ఉండుండి మెరుపులు జిగేల్మంటూ మెరుస్తున్నాయి.

అంతా భీభత్సంగా ఉంది....

గొప్ప చీదరగా ఉంది.

కాలు బయటకు కదిపే అవకాశం లేకుండా ఉంది. ఈ వానలో ఈ ఉత్పాతంలో బస్టాండుకెలా పోవడం...?

మరో గంటలో బస్టాండు దగ్గర లేకపోతే, రామగోపాలం మరింత తొందరగా దొరకడు. వాడు చెప్పినప్పుడు, చెప్పిన చోటుకు వెళితేనే దొరుకుతాడు. తర్వాతెంత ప్రయత్నించినా వాణ్ణి పట్టుకోపటం కష్టం.

''సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు బస్టాండులో ఉండు. నేను రాజమండ్రి నుండి బయల్దేరి వస్తున్నాను. బస్సు పది నిముషాలాగుతుందనుకుంటాను... మీ ఊళ్ళో.... మనం మాట్లాడుకోవటానికి ఆ టైం చాలు''.

# ఆకాశ దీపాలు

### వేద ప్రభాస్

వాడు విజయవాడ నుంచి నిన్న ఫోన్‌చేసి చెప్పేడు. వాడు చెప్పేడూ అంటే చేసి తీరుతాడ న్నట్టే... నాకందులో ఎలాటిం అనుమానం లేదు... అందుకే ఈరోజు శెలవు పెట్టేసేను. అసలింతకు బస్సు బయల్దేరి ఉంటుందా?

ఇంత ప్రళయభీకరంగా వాన రువ్వేస్తూ ఉంటే, బస్సు రావటమే అనుమానం. టైం రెండున్నర దాటిపోతోంది. వర్షం మరో గంట కాదు... రెండు గంటలైనా తగ్గదేమో....! బీరువాలోంచి రెయిన్ కోట్ వెతికి తీసేను. అక్కడక్కడా చిరిగి ఉందది. అయినా ఫర్వాలేదు. రెయిన్‌కోట్ తొడుక్కుంటూ ఉండగా తటాలున నాయికి జ్ఞాపకం వొచ్చింది. తను బలవంత పెట్టి మరీ నాచేత దీన్ని కొనిపిం చింది.

''మీరు వర్షాకాలంలో కూడా స్కూటర్ పక్కన పెట్టి డ్యూటీకి బస్సులో వెళ్ళరు. వర్షంలో మీరు తడిస్తే వొళ్లు పాడవుతుంది. మీకిది ఉండా ల్సిందే...'' అని పోట్లాడి మరీ మా పెళ్ళయిన రెండేళ్ళ రోజున నాచేత వాసన్ కొట్లో కొనిపించింది.

ఇప్పుడీ రెయిన్ కోటే మిగిలిపోయింది. నాయకే లేదు. పెళ్ళయిన కొత్తల్లో మా లోకమే వేరుగా ఉండేది. టైం చూసుకునేసరికి నాలో ఆ ఆలోచ నలు వొడ్డు నుంచి వెనక్కి మళ్ళిన కెరటంలా అయి పోయేయి.


అవును గతం పగిలిన గాజుకాయ....

గతం ఒక చిట్లిన మణిపూస.

చకచకా బయటికి నడిచి, తలుపులు మూసి, తాళం వేసేను. తలమీద కేప్ సరిగ్గా ఉందో లేదో చూసుకుని, స్కూటర్ తాళం చెవులు చేత్తో పట్టుకుని వరండా చివరకి వచ్చేను. జల్లు కాళ్ళను తడుపుతూ ఉంటే, పాదాల మీదికి చీమలు పాకుతున్నట్టనిపించింది. రెయిన్ షూ తొడుక్కుని స్కూటర్ తీసి స్టార్టుచేసి హోరు మనిపడుతున్న వానలోనే బయల్దేరేను.

రామగోపాలాన్ని కలుసుకో వటం నాకిప్పుడు చాలా అవ సరం.

***



అయిదేళ్ళక్రితం విజయవాడ ఏలూరురోడ్‌లో మేం ఉండేవాళ్లం. నాకప్పుడు బ్యాంకు ఉద్యోగం వచ్చిన కొత్తరోజులు. ఆఫీసయిపోయేక వీలయినంతసేపు విజయవాడ రోడ్లన్నీ చూస్తూ తిరిగేవాడిని. సర్వీసు నుండి నాన్న రిటైరయిపోవడంతో అమ్మా, నాన్నా నా దగ్గరకే వొచ్చి ఉండిపోవడం వల్ల నాకు ఇంటి బాధ్యత కూడా లేకుండా పోయింది... ఆ రోజుల్లోనే నాయకితో పరిచయమైంది.


స్కూటర్ గుంతలో పడినట్టుంది. హేండిల్ పట్టుతప్పి అంతలోనే సర్దుకుంది. బాలాజీ థియేటర్ దాటేను. పక్కనే పెద్దచెరువు గట్టుమీదున్న చెట్ల ఆకులు, విరిగిన చిన్నకొమ్మలు. రోడ్డంతా చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వర్షం నీరు ధారలుగా ప్రవహిస్తూ రోడ్డుకి ఎడం వైపున్న పంట పొలాల్లోకి పోయి అదృశ్యమవుతోంది. కాంప్లెక్సు ముందు స్కూటరాపి, తాళం వేసి, పరుగులాంటి నడకతో తిమింగలం కడుపులా ఉన్న బస్ స్టేషన్లోకి అడుగు పెట్టేను.

వర్షానికి అక్కడ కూడా కరెంట్ లేకపోవడంతో, నీడలు... నీడలుగా చీకటేఉంది అక్కడంతా...! టైము మూడున్నర అయ్యింది. ఎంక్వైరీలో రామగోపాలం రావలసిన బస్సు గురించి అడిగేను. కవుంటర్లో కూర్చున్నాయన వయసు రిటైర్మెంటు దగ్గర్లో ఉన్నట్టుంది. జీవితం మీదా, మనుషుల మీదా గౌరవం పూర్తిగా పోయిన వాడిలా ఉన్నాడు.

‘‘వాన చితక్కొట్టేస్తుంటే బస్సు ఎప్పుడొస్తుందో నేనేకాదు... మా ఆరెమ్ కూడా చెప్పలేడు. డ్రైవరూ మనిషే కానీ బస్సు ఇంజిన్లో భాగమేంటండీ బాబూ.... ఓ పక్క పెద్దచెరువు గట్టే తెగిపోతుందేమోనని మా వాళ్ళంతా భయపడి చస్తుంటే, మీకు బస్సు గురించి నేనేం చెప్పేది.... ఉండకండి... మీరు కూడా వెచ్చగా ఉందని ఇక్కడే ఉండిపోతే, చెరువుగట్టు కొట్టేస్తే, మాతోపాటే మీరూను... మరింక బస్సు లేదు... బస్సు ఊసూ పోలేదు. వెళ్ళిపొండి... వెళ్ళండి బాబూ... నన్ను తినీకండి’’ రెండు నిముషాల వ్యవధిలో నాకు అలా చెప్పేసి, అటువైపు తిరిగి పోయేడు.

నేనేం అన్లేదు. వెనక్కివచ్చి పోర్టికో దగ్గరగా గోడనానుకుని నిలబడి, సిగరెట్టు వెలిగించేను.

కాంప్లెక్సు ప్లాటుఫారాల మీద మూడు బస్సులు



వరసగా ఎఱ్ఱ ఏనుగులు నిలబడిపోయినట్టుగా ఉన్నాయి. రామగోపాలం వేళలు ఖచ్చితంగా పాటించే మనిషి. వాడిలో క్రమశిక్షణ చిన్నప్పటి నుంచీ చాలాఎక్కువే.... బట్టల విషయంలోనూ, చదువు విషయంలోనూ వాడు అలాగే ఉండేవాడు.... అంతాపద్ధతే వాడిది. నాయకి కూడా వాడిలాగే... అన్నీ పద్ధతిగా ఉండాలనేది. చేతివాచీ విప్పిదీసి, పొరపాటున టీ.వీ. మీద పెట్టినా వెంటనే కేకలు వేసేది. ఎక్కడి వస్తువు అక్కడే ఉండాలి తనకి. ఇల్లంతా రోజుకి నాలుగైదుసార్లు తుడిచి, దుమ్ము లేకుండా తడిబట్టతో తను తుడిస్తేనేగానీ తనకి తృప్తి ఉండేది కాదు. ఇల్లంతా అద్దంలా ఉంచడంలో నిజంగా నాయకి ఎక్స్‌పర్ట్. పెళ్ళయిన కొత్తల్లో నాకెంతో గర్వంగా ఉండేది. ఇంటికి వచ్చిన బంధుమిత్రులు, నాయకి పనితనాన్ని, శుభ్రతనీ బాగా మెచ్చుకునేవారు. మొదట్లో నాకంతా బాగానే ఉండేది. తర్వాతెందుకో గానీ కొద్దిగా అశాంతిగా అనిపించేది. అలా అనిపించడం తప్పేమో నాకిప్పటికీ తెలీదు. ఎక్కడా ఏదీమార్పులేకుండా, ఇల్లంతా గాజుపెట్టెలో పెట్టిన తాజ్‌మహల్లా అనిపించి నాకు తెలీని అసహనం కలిగేది. కళ్ళు మూసుకుని ఇంట్లో ఏ పనైనా చేసుకోగలిగే పరిస్థితి అది. కళ్ళు లేకపోతే అది చాలా లాభమేమోగానీ, కళ్ళున్న నాకు మాత్రం అది దుర్భరంగానే ఉండేది. అప్పుడు రామగోపాలం మా ఇంటికి వచ్చేడు.

ఎడ తెగని వానజల్లు కురుస్తున్నట్టుగానే, నాకు జరిగి పోయిన సంగతులన్నీ గుర్తొస్తున్నాయి.

***

ఏడాదిన్నర కిందట... ష్వార్జెనెగర్ సినిమా బాలాజీ థియేటర్‌కి వొచ్చి రెండు రోజులైంది. నాకిష్టం అతడి సినిమాలు. నాయకి అంతగా ఇష్టపడ కుండా నా కోసం చేసే పనుల్లో నాతో ఆ హీరో సినిమాకి రావడం కూడా వొకటి. ఇతర గ్రహం నుండి వొచ్చిపడిన జీవితో ష్వార్జెనెగర్ భీకర పోరాటం చేస్తున్నప్పుడు, నేను వొళ్ళు మరచిపోయి ఆ దృశ్యాల్ని చూస్తున్నప్పుడు, నాయకి నా భుజం మీద గట్టిగా తట్టిలేపింది. ''నేను భరించలేకపోతున్నాను. వెళ్ళిపోదాం'' అంది. నాకు విపరీతమైన కోపం వచ్చింది. ''ఒక్కరగంట ఓపికపట్టు. వెళ్ళిపోదాం'' అన్నాను వీలయినంత మృదువుగానే. నా కళ్ళు సినిమాతెరని విడిచి రామంటున్నాయి. చటుక్కున లేచి నిలబడింది నాయకి. ''నేను వెళ్తాను. మీరు సినిమా అయ్యేకరండి'' అంది. అలా అంటూనే బయటకు కదిలింది. నాకు చాలా చిరాగ్గా అనిపించింది. అలాంటి పరిస్థితుల్లో నేను లేచి నాయకిని అనుసరించేవాణ్ణి. ఆ రోజు మాత్రం నేను తలకూడా తిప్పకుండా ఉండిపోయేను. అంతరంగంలో, అసహనం తరంగా తరంగాలై ఎగిసిపడు తుండడంతో 'సినిమా చూడటంలో' లీనం కాలేకపోయాను. రాత్రి తొమ్మిదిన్నరకి నేను ఇంటికిచేరి స్కూటర్ లోపలపెట్టి గుమ్మంలోకి వచ్చేసరికి డ్రాయింగ్ హాల్లో లైటు ప్రకాశవంతంగా వెలుగుతోంది. నాయకి గార్డెన్ ఛెయిర్లో కూర్చుని ఎదురుగా సోఫాలో వెనక్కి చేరబడి, సిగరెట్ కాలుస్తున్న రామగోపాలంతో నవ్వుతూ మాట్లాడుతోంది. రామగోపాలాన్ని చూడగానే నాలో గూడుకట్టుకున్న కోపం, మంచులా కరిగిపోయింది. ''గోపాలం... ఎంతసేపైంది వచ్చి... ఒక్క ఫోన్‌చేస్తే నీ కోసం వచ్చేవాణ్ణి కదరా...!'' వాడి పక్కనే కూర్చుని వాడి కుడి చెయ్యి నా ఎడం చేతిలోకి తీసుకుంటూ అడిగేను. ''అరగంటైందిరా... అభిరాం...! ఇంటికి తాళంవేసి ఉంటే ఫోన్ చెయ్యబోయేను. అంతలో ఇంటిముందు రిక్షాలో ఈవిడ దిగేరు. ఈవిడేగానీ రాకపోతే నేను నీతో ఫోన్లో మాట్లాడి వెళ్ళిపోయే వాణ్ణేమో కూడా... ఒక్కోసారి పరిస్థితులు మన చేతుల్లో మాత్రమే ఉండవనేది నాకిప్పుడిప్పుడే తెలుస్తోందిరా'' అన్నాడు. ''సర్లేరా... దానికంత సంజాయిషీ ఎందుకు'' అన్నాను నేను అభిమానంగా.

''నేనా దిక్కుమాలిన సినిమా భరించలేక పోవడమే మంచిదయ్యింది'' అని నవ్వింది నాయకి. ''మీమాట రైటు. సినిమాల్లో అంతంత హీరోయిజం చూపిస్తాడా... ఆష్వార్జెనెగర్ చుట్టూ బాడీగార్డులు లేకపోతే ఇల్లు కదలడట'' అన్నాడు రామగోపాలం. నేనేం మాట్లాడలేదు. మాట్లాడలేక కాదు. రామగోపాలంతో వాదన నా కిష్టం ఉండదు. నాయకి డిన్నర్ ఏర్పాట్లు చేయడానికి వంటింట్లోకి వెళ్ళింది. ''అభిరామ్ నాయకిలో చాలా మంచి లక్షణాలున్నాయి సుమా... నువ్వంటే ఆమెకి చాలా అభిమానం. నువ్వు చాలా అదృష్టవంతుడివి... చెప్పడం మరిచి పోయేను... బొంబాయి నుంచి వచ్చేసేను నేను. రాజమండ్రిలో ప్రాక్టీసు పెట్టేను... బాగుంది. నీ సంగతేమిటి''.

''పెద్దగా విశేషముంది రామూ... బేంకు ఉద్యోగాల్లో మునుపటి ఛార్మ్ ఇప్పుడు లేదు. ఏదో సాగిపోతోంది'' అన్నాను నేను. ఇంకేవేవో విషయాలు అతను చెప్పుతూనే ఉన్నాడు. నేను కూడా నా గురించి, మా ఇతర స్నేహితుల గురించి నాకు తెలిసిన విషయాలు చెప్పేను. రాత్రి చాలాసేపు ఇద్దరం మేలుకునే ఉన్నాం. భోజనాలయ్యేక నాయకి మాతో కాస్సేపు కూర్చుని తర్వాత లేచి వెళ్ళి పడుక్కుంది. అప్పుడే రామగోపాలం పరిచయమయ్యేడు నాయకికి. ఇప్పుడు నాకన్నా రామగోపాలమే ఎక్కువయ్యేడు.


వాడు నన్ను బస్టాండుకు రమ్మనమన్నదీ నాయకి గురించి నాతో మాట్లాడానికే....

***

చేతిలో ఉన్న సిగరెట్ పూర్తవ్వడంతో అవతలకి విసిరేను. వర్షం ఉధృతి కొంచెం తగ్గినట్టుంది. కేంటీన్లోకిపోయి కాఫీ తాగుతూ కూర్చోవచ్చని అటువైపు నడిచేను. కేంటీన్లో టేబుళ్ళమీద కొవ్వొత్తులు వెలిగించేరు. వాష్ బేసిన్ పక్కగా ఉన్న టేబుల్ దగ్గర స్థిమితంగా కూర్చున్నాను. కాఫీ కప్పు కవుంటరు నుండి తెచ్చుకుని నాయకి వెళ్ళిపోయి ఏడు నెలలు గడిచిపోయేయి. విజయవాడలో పరిచయమై ప్రేయసియై, భార్యా అయి, విజయనగరంలో నానుండి దూరమై పోయింది. తల కొద్దిగా తడిసి నట్టుంది. జుట్టులోంచి నీరు చుక్కగా మారి, నుదుటి పక్కనుంచి, చెంప మీద మెత్తగా పడింది. కాఫీ కప్పు టేబులుమీద పెట్టి, రుమాల్తో మొహం తుడుచుకున్నాను. కేంటీనంతా గోలగోలగా ఉంది. ఆలోచన్లు ముందుకు నడవలేదు. లేచి బయటికి వచ్చేను.

ఎస్టర్ డే గాన్... స్వీట్ జీసస్
ఎండ్ టుమారో విల్ నెవర్ బి మైన్...
గాడ్ హెల్ప్ మీ టుడే
ఎండ్ షో మీ... ది వే-

ఎవరో ఎఫ్.ఎమ్. ట్యూన్ చేసినట్టున్నారు. బోనీదో మరెవరిదో గానీ పాట ఒక్కసారిగా ఖంగ్‌మంటూ మొదలై తీగలాగా సాగింది. దేవుడా నువ్వంటూ ఉంటే, ఈరోజు నాకివ్వు. రామగోపాలంతో మాట్లాడే సమయం అవకాశం నాకివ్వు... నా నాయకి లేని బతుకు నేను బతకలేను. నాకు మరేదీ అక్కర్లేదు. మనసులోనే కోరుకున్నాను. నాయకి అంటే నాకు ప్రాణం. నాయకి నా సర్వస్వం... నా కోసం నేనేదీ చేసుకోలేకుండా, నాకన్నీ తానే అయి, నావన్నీ తనవే చేసుకున్న తను లేని బతుకు నాకు నరకమై పోయింది. మనసు ఘనీభవించిపోవటం



వల్ల, మాట వజ్రమై, మనుషుల్తో మనిషిలాగా బతకలేక పోతున్నాను. నాయకి వెళ్ళి పోవటానికి రెండు రోజుల ముందు... నేను రహస్యంగా చదివిన ఆమె డైరీలోని వాక్యాలకి అర్థం నాకు తెలియాలి. ''కొన్ని రహస్యాలు జీవితాల్లో గుట్టుగానే ఉండిపోవాలి. చితుల మీద భద్రంగా కాలిపోవాలి. అలాకాకపోతే, రహస్యంగా ఉండిపోవల్సినని రాక్షసంగా గుండెల్ని కాలుస్తాయి. బతుకుల్ని బండలే చేస్తాయి.'' ఏ రహస్యాల నామె గుండెల్లో గుట్టుగా దాచిందో, నాకిప్పటికీ తెలీదు. ఆ వాక్యాలు చదివిన నాటి నుంచీ నా గుండెల్లో అగ్నివర్షం కురుస్తూనే ఉంది. నాకేమీ చెప్పలేదామె... నా నీడంటే పడనట్టే అయిపోయింది. అంత ఆకస్మికంగా నాయకి నన్ను అసహ్యించుకోవడానికి, కారణాలేమిటో... నాలో దేన్ని తాను ద్వేషించిందో, నాకేమీ తెలీదు. అందుకే రామగోపాలం రావాలి. వాడే చెప్పాలి. నాయకికీ నాకూ మధ్య బలంగా లేచిన అడ్డుగోడలు వాడి సహాయంతోనే ఛేధించాలి. అందుకే బస్సు వచ్చేదాకా ఉండ దలుచుకున్నాను. ఒక జీవితకాలం ఆలస్యమైనా ఫర్వాలేదు!

నాయకి లేని జీవితం జీవితమైతే కదా...!!

***

బస్‌స్టేషన్లో నిలబడిన నీళ్ళను చీల్చుకుంటున్నట్టుగా పెద్దగా చప్పుడు చేస్తూ వేగంగా వచ్చి ఓ బస్సు ప్లాట్‌ఫారం మీద ఆగింది. బస్సు ఆగుతూనే... ఒక్క దూకు దూకి ఎంక్వైరీ కవుంటర్ దగ్గరకు పరుగెడు తున్నట్టుగా వెళ్లేడు కండక్టరు. డ్రైవరూ అంతే వేగంగా అతనితోపాటే వెళ్ళేడు. నేను ఆ బస్సు దగ్గరకు వెళ్ళేను. విశాఖపట్నం నుండి విజయ నగరం వచ్చే ఎక్స్‌ప్రెస్ బస్ అది. రామగోపాలం వచ్చేది కాదు. వర్షం నెమ్మదిగా వెలిసిపోతూ ఉంది. ఒక బస్సు వచ్చిందంటే వెంటవెంటనే మిగిలినవి వస్తాయన్న నమ్మకం కలిగింది. బస్సుదిగిన పాసెంజరు మాటలు పెద్దగా వినపడడంతో చటుక్కున అటు తిరిగేను. ''అంత ఘోరం నా జన్మలో చూళ్ళేదు. తలుచుకుంటూ ఉంటే దడపుట్టు కొస్తోంది. మా బస్సుకన్నా పావుగంట ముందు బయల్దేరింది. నేనెదెక్కుదామనుకుని ఎందుకో మరి ఇదెక్కిపోయేను. బతికిపోయేను'' అతను ఉద్రేకంగా ఉద్విగ్నంగా చెపుతున్నాడు. బస్టాండులో జనం అతని ముందు గుమికూడేరు. నాకేదో భయం వేసింది. ఒక్క నిముషంలో ఎంక్వైరీ కవుంటర్ చేరుకున్నాను. నన్ను చూసి ఎంక్వైరీ కవుంటర్ ఆయన జాలిగా అన్నాడు. ''మీరిందాక అడిగేరే ఆ బస్సే సార్. తగరపువలస బ్రిడ్జి రెయిలింగ్‌ని ఢీకొని ఏట్లో పడిపోయిందంటున్నారు. ఒక్కరు కూడా మిగిలే అవకాశం లేదట... మీ వాళ్లెవరున్నారో ఏమో పాపం... మీరు పావుగంట ఆగితే రిలీఫ్ బస్సులో వెళ్ళొచ్చు...''

నాకు కాళ్ళల్లో వణుకు బయలేర్దింది. మెదడంతా ఒక్కసారిగా ఖాళీ అయిపోయింది. మాటలు గడ్డ కట్టుకుపోయేయి. నేనక్కడ ఆగలేదు. ఎవరో తరుముతున్నట్టే స్కూటర్ తీసి బయల్దేరేను.

.. వర్షం మళ్ళీ మొదలైన సంగతి నాకు తెలియలేదు. నేనెంత వేగంగా వెళుతున్నదీ నాకు అంతకన్నా తెలియలేదు.

తగరపువలస ఏటి బ్రిడ్జిమీద జనం. బ్రిడ్జికింద పొంగి పొర్లుతున్న ఏటివారగా గుంపులు గుంపులుగా జనం. స్కూటరెక్కడో పడేశాను. గుంపుల మధ్యగా పరుగులు తీస్తున్నాను. జనం మధ్యగా ఏటివారగా దూసుకుపోతున్నాను. పోలీసులు తాళ్ళతో ఏటివొడ్డున హద్దులు ఏర్పాటు చేసేరు. వరదొచ్చినట్టుగా ఏరు వొడ్డులు తీసి పారుతోంది. బస్సు పడిపోయిన ప్రదేశం జాడ కూడా తెలీటం లేదు... ఏట్లో దిగడానికి ఎవరూ సాహసించడం లేదు. ఏటి అవతలవొడ్డుకీ, ఇవతల వొడ్డుకీ గుంజలు పాతి, తాళ్ళుకట్టి ఏట్లో దిగడానికి కొందరు సిద్ధమయ్యేరు. ''బస్సు నీట్లో తిరగబడి పోయినట్టుంది... ఎవరూ బతికి ఉండే అవకాశం లేదు. అసలెవరూ బయటికి రాలేదింతవరకూ.... ఎందరున్నారో... ఏమో...'' సి.ఐ. అంటున్నాడు. వర్షం తన పనైపోయినట్టుగా తగ్గి పోయింది. చూడ్డానికి వస్తున్న జనం బాగా పెరిగిపోయేరు. ఎవరిదో సూట్‌కేసు కాబోలు హఠాత్తుగా నీట్లో తేలుతూ పోతోంది. జనంలో కేకలు మిన్నుముట్టేయి. నేనేం చెయ్యగలను... పూర్తిగా అసహాయస్థితి. నిస్త్రాణగా వెనక్కివచ్చి బ్రిడ్జి రెయిలింగ్ నానుకుని నిలబడిపోయేను. బ్రతుకంటే విశ్వాసం... రామగోపాలంలో ఎక్కువ. నాయకిలో మరీ ఎక్కువ.

''రామ్! మనకప్పుడే పిల్లలొద్దు'' అంది పెళ్లైన ఆర్నెల్లకి. ''రామ్...! మనం తొందరగా ఇల్లుకట్టుకోవాలి. పిల్లలు పెద్దవాళ్లయితే కట్టుకోలేం'' అంది. ''నేను కంప్యూటర్ కోర్సులో చేరతాను. ఇద్దరూ సంపాదించుకుంటే ఆర్థికంగా ఇబ్బందులుండవు'' అని కూడా అంది. ఇలా అన్నీ స్థిర నిర్ణయాలే. అన్నీ స్పష్టమైనఆలోచనలే. నేనెందుకలా ఉండలేనో నాకిప్పటికీ తెలీదు. అన్నీ ఆలోచించగల నాయకి ఆరోజెందుకలా ప్రవర్తించిందో నాకేం అర్థం కాలేదు....

''నన్ను ముట్టుకోకు... ఈరోజు నుండీ నామీద చెయ్యివేస్తే చచ్చి పోతాను'' అంది. పట్టుదలకొస్తే నేనూ తగ్గని మనిషినే. రెచ్చిపోయి నేనన్న మాటలకే మనసు విరిగిపోయిందో, మరెందుకో... నాకు తెలీదు. తను వెళ్ళిపోయింది. కనీసం నాకు చెప్పను కూడాలేదు. మూడో రోజు తర్వాత నేను ఫోన్‌చేస్తే ఎవరో పనిమనిషి కాబోలు మరెప్పుడూ ఫోన్ చేయొద్దని చాలా అసహ్యంగా మాట్లాడింది. రెండు నెలల కిందట రామగోపాలం ఫోన్ చేసినప్పుడు ఉండబట్టలేక వాడితో చెప్పేను. వాడు అంతా విన్నాక అన్నాడు. ''అభిరాం! నీ సంగతి నాకు బాగా తెలుసురా! నాయకి గురించీ కొంతవరకూ అర్థం చేసుకున్నాను. పొరపాటు జరిగి పోయిందిగా... దిద్దుకుంటే పోదా...!! మరొక్కసారి ఫోన్ చెయ్యి... లేదా నువ్వే వెళ్ళు. తనొస్తుంది. వొస్తుందనే అనుకుంటాను... రాకపోతే నేను ప్రయత్నిస్తాను''. నేను ఒప్పుకోలేదు. మనసులో అయిన గాయం లోతు బాగా ఎక్కువగా ఉండటం వల్ల నేను వాడి మాటలకి అవుననీ, కాదనీ చెప్పలేదు. అమ్మా నాన్నా తిరుపతి నుండి వస్తూ ఏక్సిడెంట్లో చనిపోయిన రోజుల్లో నన్ను కంటికిరెప్పలా కాచుకున్న నాయకి ''పిచ్చి తండ్రీ... నేను లేనూ..!'' అని గుండెల్లో పొదువుకున్న నాయకి... నన్ను వొదిలి ఎలా వెళ్ళిపోయింది. ఎందుకు...? ఎందుకు? కడుపులో దుఃఖం కొండలా పేరుకుపోయింది. రామగోపాలం మీదే నా ఆశలన్నీ పెట్టుకున్నాను. వాడే నా పరిస్థితి చక్కదిద్దగలడని బలంగా విశ్వసించేను. ఏమయ్యాడు రామగోపాలం.... వాడు రావాలని ఎంతగా కోరుకున్నానో వాడు రాకుండా ఉంటే బాగుండునని అంతకన్నా ఎక్కువగా భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఇప్పుడు ఏటి ఒడ్డున పరిస్థితులు కంట్రోలు లోకి తెచ్చుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నేను బ్రిడ్జి కిందకి వెళ్ళడానికి బయల్దేరేను. రెండడుగులు వేసేసరికి నాకు తెలిసిపోయింది. నా శక్తి హరించుకుపోయిందని... విపరీతమైన జ్వరం వచ్చిందని. నాకు స్పృహ తప్పి పోతుండగా ఎవరో అంటున్న మాటలు వినిపించేయి ''అయ్యో... ఎవరో... తన వాళ్ళు పోయేరని తెలిసి తట్టుకోలేక పోయేడు''.

***

రంగులు... ఎన్నెన్నో రంగులు... రాగాలు పాడుతున్నాయి. జాడలు... జాడలుగా నీడలు... నీడ

## ఎలా జీవించాలో ఆచరణలో చూపారు



'కన్ను తెరిస్తే జననం
కన్ను మూస్తే మరణం
రెంటి నడుమదే జీవితం'

అన్న ప్రసిద్ధ మాటలను ఎప్పుడూ అలవాటు పదాలుగా వాడుతూ ఎలా జీవించాలో ఆచరణలో చూపిన మా చిన్నాన్న రాంషా గారే నాకు సాహిత్యం మీద ఆసక్తి కలిగించేరు. ఈ కథ 'ఆకాశదీపాలు' అలాటి జీవితాన్ని ఓదాన్ని చూపించాలని చేసిన ప్రయత్నం. విశేష బహుమతినిచ్చి భుజం తట్టిన 'నవ్య'కు కృతజ్ఞతలు.

కథా రచన ప్రస్తుతం విస్తృతమయ్యింది. ఎందరో ప్రతిభావంతులైన రచయితలు అద్భుత రచనలు చేస్తున్నారు సాహిత్య పరంగా రచయితలను ప్రోత్సహించేందుకు నవ్య పత్రిక చేస్తున్న కృషి బహుధా ప్రశంసనీయం.

మరోసారి కృతజ్ఞతలు..

**-వేదప్రభాస్**
**(జె.వి.బి.నాగేశ్వరరావు)**
**ప్లాట్ నెం. 25బి-జి2,**
**స్వాతి కన్‌స్ట్రక్షన్స్, భగవాన్ నగర్,**
**విజయనగరం-535002**
**9490791568**


లుగా... వన్నెచిన్నెలుగా, రూపరహితంగా... అంతటా రంగులే... అన్నీ రంగులే...!

నాయకి నవ్వుతోంది. అంతలోనే కళ్ళు పెద్దవిచేసి, పెదాలు కరిచిపెట్టి, తర్జనితో బెదిరిస్తోంది. నే నేడుస్తున్నాను. రామగోపాలం శరీరం నాయకి ముందు అచేతనంగా పడి ఉంది. నాయకి కాళ్ళతో దానిమీద భీభత్స నృత్యం చేస్తోంది. ఒక్కసారిగా మెలుకువ వచ్చింది. హాస్పిటల్లో ఉన్నాను. సెలైన్ రక్తంలోకి నెమ్మదిగా ఇంకుతోంది. కొద్దిసేపయ్యాక ఓ నర్సు వచ్చింది. నన్ను చూసి నవ్వుతూ పలకరించింది.

''గుడ్... లోకంలో పడ్డారన్నమాట.'' అని టెంపరేచర్ చూసి, సెలైన్ బాటిల్ ఎడ్జస్టు చేసి ''కొంచెం సేపట్లో డాక్టర్ గారొస్తారు.'' అని చెప్పి వెళ్ళిపోయింది. నేనేదో అడిగానేను కానీ నా మాటలు నాకే వినబడలేదు. వేళ ఎంతైందో తెలీటం లేదు. దట్టమైన పరదాలతో కిటికీలు మూసి ఉన్నాయి. బల్బు కనపడకుండా కాంతి మాత్రమే గదిలో నిలబడి ఉండడంతో వేళ ఎంతై ఉంటుందో ఊహించలేక పోయేను. కళ్ళు మూతలు పడేంతలో

కవిత

## గాయపడిన వేటగాడు



నాకో విల్లు కావాలి
ఓ బాణమూ కావాలి
విల్లూ బాణమూ వచ్చాక
గురి చూడ్డానికో శిరస్సు కావాలి
ఆ శిరస్సు నాదే కావాలి
వక్కలయ్యే తల నాదే ఐనా
నారిని లాగే నా చేతుల్లో నిశ్చలత్వం
భూమిని తన్నిన నా కాళ్లలో పటుత్వం

గురి చూడాల్సిన నా కళ్లు
లక్ష్యస్థానంలో ఉండి
నన్నే గురి చూస్తున్నవి
లేని నా కళ్లలోకి ప్రశ్నల ఈటెలు
విసురుతున్నవి
వేటగాడెవ్వడు, గాయమెవ్వరిది
దూసిన చూపుల కత్తెవ్వరిది
కత్తి కొనన గుచ్చిన హృదయమెవ్వరిది
మొదలెట్టిన వాడెవ్వడు, మోసేదెవ్వడు

నన్ను తాకి ప్రతి ఈటే,
విరిగి, విస్ఫోటనమై
నలుదిక్కులా సమాధానమై గర్జించింది
వేటా నాదే – వేటూ నాదే
ఆమే నేనే – అతడూ నేనే
ఆదీ నేనే –అంతమూ నేనే
ఆద్యంతముల మధ్య – సమస్తమూ నేనే!

**– వైజా నారాయణరెడ్డి**

ఓ కుర్రడాక్టరు వెనకాతల ఇందాక నర్సుతో వచ్చేడు.

''మిస్టర్ అభిరామ్... హౌ డు యుఫీల్ నౌ.... అఫ్‌కోర్సు నాట్ సో బెటర్... బట్ అయ్ హోప్ యు విల్ బి ఫైన్ ఇన్ ది ఈవెనింగ్... నర్స్... ఈ ఇంజక్షన్ చెయ్యి...'' అని చెప్పి, నా బెడ్ దగ్గర ఉన్న స్టూల్ మీద కూర్చున్నాడు. నా భుజంమీద చెయ్యి వేసి, ''మీరేం అడగాలను కుంటున్నారో నాకు తెలుసు. మిమ్మల్ని పోలీసు డిపార్టుమెంటు మనుషులే ఇక్కడ చేర్చేరు. మీ జేబులో ఉన్న పర్సులో మీ వివరాలు వాళ్ళకి దొరికేయి. ఈ మూడు రోజులూ మీకు వైద్యం మేం చేసినా... ఆవిడ మాత్రం ఇరవై నాల్గు గంటలూ ఇక్కడే ఉండి మిమ్మల్ని కంటిపాపలా చూసుకున్నారు. యు ఆర్ వెరీ లక్కీ టు హేవ్ సచ్ ఎ ఉమన్'' అని లేచి వెళ్ళబోతూ అన్నట్టు ''పోలీసు డిపార్టుమెంటు మనిషి మీ కోసం సాయంత్రం వస్తాడు'' అని వెళ్ళిపోయేడు. ''రామగోపాలం ఎక్క డున్నాడు?.... ఏమయ్యింది వాడికి?'' నర్స్‌ని అడిగేను. నాకు ఆమె మీద ఆవ్యాజానురాగం కలిగింది. ఈమె గురించే కదా డాక్టర్ చెప్పింది. నర్స్ తనకా విషయాలేమీ తెలీవంది. సాయంత్రం వచ్చే పోలీసుని అడగమని సలహా ఇచ్చింది. ''మీరు చేసిన సేవలు వెలకట్టలేనివి'' అన్నానామెతో. ఆమె నవ్వేసింది. ''మేం చేసిందేమీ విశేషం కాదు. అది మా డ్యూటీయే... ఆవిడ చేసిందే విలువైంది'' అంది. నా కర్థం కాలేదు. నాకేదో అనుమానం కలిగింది. ''ఎవరు?'' అడిగేను. ''ఎవరో మీ బంధువేనటగా...! కట్టుకున్న భార్య కన్నా ఎక్కువగా శ్రమ పడింది. మీకు తెలివి రావడానికి ముందే ఆమె వెళ్ళిపోయింది.'' ''ఎవరు?''

''నాయకి... అందామె పేరు''. నా కళ్ళు నీళ్ళతో నిండిపోయేయి. కన్నీరుతో దిండు తడిసిపోయింది. నాకింకేం కావాలి. కానీ అంతలోనే ఏదో అనుమానం. మరైతే తను ఉండలేదేం! ఏమంత అర్జంటుపని ఉందని అంత త్వరగా వెళ్ళిపోయింది... ఇంతలో పోలీసు ఒకాయన వచ్చేడు. అతను చెప్పిన దాని ప్రకారం ప్రమాదం జరిగిన బస్సులో ఏ ఒక్కరూ బతకలేదు. రామగోపాలం కూడా చనిపోయేడు. అతని బాడీని వాళ్ళెవరో తీసుకుపోయేరట అని చెప్పి, అతను ఒక బ్రౌన్ కవరు ప్లాస్టిక్ కవరులో చుట్టినది తీసిచ్చేడు. ''ఈ కవరు ఆయన షర్టు జేబులో భద్రంగా ఉంది. పైనున్నది మీ పేరు కనుక, మిమ్మల్ని హాస్పటల్లో చేర్పినప్పుడు మీ పేరు మాకు తెలిసింది కనుక, ఈ కవరు మీకిద్దామని ఉంచేసేము. ఇదుగో మీ పర్సు, ఇవి మీ స్కూటర్ తాళాలు. స్కూటర్ హాస్పిటల్ పార్కింగ్ లాట్‌లో ఉంచేను. మీ పర్స్ చెక్ చేసుకుని మీ వస్తువులు ముట్టినట్టుగా ఇక్కడ సంతకం చేయండి''.

నేను యాంత్రికంగా సంతకం చేసేక అతను వెళ్ళిపోయాడు. కవరు బరువుగా ఏం లేదు. బస్సు ఆగే సమయంలో విషయం చెప్పగలనో లేదో అనుకుని లెటర్ రాసి ఉంటాడు. నేను వెంటనే విప్ప లేదు కవరుని. వాడే గుర్తొచ్చేడు. కవర్లో గుండెలు బద్దలుచేసే రహస్యం ఉంటుందని నాకు తెలిసిపోయింది. ఇప్పుడా రహస్యంతో నాకు మరి అవసరం లేదు. పర్స్‌లోంచి సెల్‌ఫోన్ తీసి నాయకికి ఫోన్ చేయబోతూ ఆగేను. మూడు రోజులూ నా పక్కనే ఉన్న ఆమె ఇప్పుడెందుకు లేనట్టు. నాయకి మీద నా కోపం పోయింది. ఆమె నా దగ్గిరే ఉంటుందని నాకు తెలిసిపోయింది. నాకు తెలీని కారణంగా నేనామెని మరి దూరం చేసుకోదలుచుకోలేదు. కవరు దిండు కింద పెట్టేను. విశ్రాంతిగా వెనక్కి వాలి సీలింగ్ వైపు చూస్తూ ఉండిపోయేను. నాకు ప్రశాంతిగా ఉంది. ఉప్పెనొచ్చి తీసిన ఊరులా ఉంది మనసు. ఏ అసంకల్పిత ప్రతీకారచర్య ఫలితమో... ఉన్నట్టుండి కవరు తీసి చించేను. ఉత్తరం చదివేను. భయపడుతూనే చదివేను. రహస్యం విస్ఫోటనమైంది. వ్యక్తుల హృదయాలు ఆవిష్కృతమయ్యేయి. మేరు శిఖరాల్లాంటి మహోన్నత వ్యక్తిత్వాల ముందు, నేనెంత మరుగుజ్జునో తెలిసి వచ్చింది. వాడు రాసేడు. మా ఇద్దరికీ మధ్య గోడ వలకి మూల కారణం ఏమిటో... నాయకికి నేనంటే ఎంత ప్రేమో... నాకర్థం అయ్యేలా రాసేడు...

నేను ట్రైనింగ్‌కి హైదరాబాద్ వెళ్ళినప్పుడు నాయకిని విజయవాడలో దించి వెళ్ళేను. సినిమాకి వెళ్ళి వస్తూ తనకి చిన్న ఏక్సిడెంటు అయితే వాళ్ళ వాళ్ళు తనని హాస్పటల్లో జాయిన్ చేసేరు. నాకు తెలుసా సంగతి. అప్పుడు రక్తం అవసరమైతే డొనేట్ చేసేరు. పదిహేను రోజులైంది తను కోలుకోడానికి. రెండో నెలలో తనకి ప్రెగ్నెన్సీ వచ్చిందేమోనని అనుమానం వచ్చింది. నేను ట్రైనింగ్ నుంచి వచ్చేసరికి శుభవార్త చెపుదామని డాక్టర్ దగ్గరకి వెళ్ళింది. ఆ డాక్టర్ చేసిన రక్తపరీక్షల్లో హెచ్.ఐ.వి. పాజిటివ్ బలంగా ఉన్నట్టు తేలిందట. వివరంగానే రాసేడు వాడు. ఆ సంగతి నాకు నాయకి చెప్పలేదు. నాకు చెప్పాలనే అనుకోలేదు. నా జీవితం బలి కాకూడదని, నా నుండి వేరయి పోయిందామె. నా గుండె బరువెక్కింది. ప్రేమంటే... ఇదేనా..? ప్రేమను భరించడం ఇంత కష్టమా... నా మనసు మండిపోతోంది. వాడు చివరగా రాసేడు. ''ఒరేయ్... ఎంత కాలం బతికామన్నదికాదు.. ఎంత ప్రేమగా బతికామన్నది ముఖ్యమను కుంటాను నేను. నిర్ణయం నీదే.'' నేను నిర్ణయం క్షణంలో తీసుకున్నాను.

***

రెండేళ్ళ తర్వాత హోమ్ ఫర్ ఎయిడ్‌లో నా వొళ్ళో తలవాల్చుకునే మరణించింది నాయకి. ఆమె చివరి జీవితకాలం ప్రశాంతంగా గడిచేలా నేను చూసుకున్నాను. నా కర్తవ్యం ఆమె నుండే నిర్ణయించుకున్నాను. ఆమెలాంటి వాళ్ళు ఆడా మగ హోమ్‌లో చాలామందే ఉన్నారు. ప్రతీ కార్తీక పౌర్ణమి నాడు హోమ్‌లో రెండు ఆకాశదీపాలు వెలిగిస్తాం మేమందరం. ఆ రెండు దీపాలూ నాకు మౌనంగా దిశా నిర్దేశం చేస్తు నిండుగా వెలుగుతాయి.

✻